# 12

# నగల గోవిందం

నాకు కాళ్ళూ చేతులూ ఆడటంలేదు. అక్కడినుంచి బయలుదేరాడు మా వెంకట్. ఇప్పుడో ఇహనో రావాలి. సిటీ లిమిట్స్‌లోకి వచ్చేశాడు. ఫోన్ చేశాడు.

"ఒళ్ళు హూనం అయిపోయింది. రోడ్లు బాగాలేవు. వర్షం..." అంటూ సోది చెప్తుంటే విసుక్కున్నాను.

"అవన్నీ అందరికీ తెలిసిన విషయాలే. అసలు విషయం చెప్పు" అన్నాను.

"చెప్పడం ఎందుకు? నువ్వే చూస్తావుగా. తల పగిలిపోతోంది. కాఫీ రెడీగా ఉంచు" అని అసలు విషయం దాటేశాడు మళ్ళీ. నిన్న పొద్దుటినుంచీ ఇదే గొడవ.

నిన్న పొద్దున ఫోన్ చేశాడు. "ఏరా... ఏమైంది? కాయా పండా?" అన్నాను.

"నేను తల్చుకుంటే పండే కదుటే" అన్నాడు ఉత్సాహంగా. వివరాలడిగితే మాత్రం చెప్పలేదు. "నువ్వే చూస్తావుగా! చూశావంటే ఆశ్చర్యపోతావు" అంటూ తెగ ఊరిస్తున్నాడు.

నాకసలే కంగారు. సస్పెన్సంటే అస్సలు భరించలేను. పోనీ కాస్త మనసు మళ్ళించుకుందామని టీవీ చూద్దామంటే విసుగొచ్చేస్తోంది. అన్ని ఛానల్సులోనూ అదే గొడవ. 'దేవుడి సొమ్ము కైంకర్యం. ఏడుకొండలవాడి నగలకు ఏది రక్ష? కొండమీద నగలకీ తిరుక్షవరం' అంటూ యతీ, ప్రాస కుదిరేలాగా హెడ్‌లైన్సు కూర్చి ఘోషపెడుతున్నారు. అందుకు కారణమైనవారిని దుమ్మెత్తిపోస్తున్నారు. వాళ్ళేమో 'సామాన్యంగా ఉన్నాయా నగలు? వాటన్నింటినీ లెక్కలుకట్టి చిట్టాలో పొందుపరచాలంటే సాధ్యమా ఎవరికైనా? ఆకాశంలో చుక్కలు లెక్కపెట్టడం అంత కష్టం' అంటున్నారు.

నిజమే పాపం, 'ఓడు ఓడు అంటే కంచం అంతా ఓడు' అని సామెత చెప్పినట్లు. అందరూ ఏకమై, వాళ్ళని ఆడిపోసుకోవడం అన్యాయం కదూ. వెధవది... మనలాంటి మామూలువాళ్ళ ఇళ్ళల్లోనే శుభకార్యాల సందర్భంలో వెయ్యికళ్ళతో కాపాడుకున్నా, ఏ ఉంగరమో, గాజో మాయమైపోతుంది. మరి అంతమంది జనం హడావిడి, సేవలూ వూరేగింపులూ దర్శనాలూ ఉప్పెనలా వచ్చిపడే జనం, వీటన్నిటినీ సమర్థించు కుంటారా... లేకపోతే వజ్రాలై వైడూర్యాలూ రాలిపోయాయని బాధపడతారా?

అయినా ఎప్పుడో ఏడుతరాల కిందటి నగలకు ఇప్పుడు లెక్కచెప్పమంటే నాబోటిదే చెప్పలేదు. నేనేవిటి... 'మీ ముత్తాతగారి తల్లికి ఎన్ని నగలుండేవి' అంటే ఎవరూ చెప్పలేరు.

ఇక కొండమీద నగలు ఈనాటివా? ఎప్పటి ఆకాశరాజు... ఎప్పటి కృష్ణదేవరాయలు? ఎవరు ఏం ఇచ్చారో ఎవరికి తెలుసు. రామదాసుగారు ముందు జాగ్రత్తపడి దుఃఖంలోనైనా నగల పట్టీ చదివాడుగానీ అన్నమయ్య అన్ని వేల సంకీర్తనలు రాసినా నగల ప్రస్తావన తేలేదు. అసలు ఇంతకాలం ఆ విషయం ఎవరూ పట్టించుకోలేదు. ఏదో... కాలం కలిసిరాక ఇప్పుడు గుప్పుమంది. అందరూ ఏకమై ఆడిపోసుకుంటున్నారు. ఈ సంబడం ఎన్నాళ్ళుంటుంది... మరో సమస్య ఎదురయ్యే దాకా. అంతేగా! తర్వాత ఈ వార్త పాతబడి పోతుంది. ఆ తర్వాత గాల్లో కలిసిపోతుంది. ఎవరికీ గుర్తుకూడా ఉండదు.

ఏదీ, 'కంచి స్వాములవారు ఎన్నాళ్ళు జైల్లో ఉన్నారు? వీరప్పన్ చెరలో కన్నడ హీరో రాజ్‌కుమార్ ఎన్నాళ్ళున్నాడు?' అని ఎవర్నైనా అడిగి చూడండి. 'అసలివన్నీ జరిగాయా' అని ఆశ్చర్యపోయి, 'అవును జరిగాయి ఎప్పుడో, ఎవరికి గుర్తు' అనేస్తారు.

ఇదీ అంతే. కాకపోతే ఇది జైలు వ్యవహారం కాదు. బంగారం గొడవ కాబట్టి అందరికీ చురుకుపుట్టింది. 'ఏవిటీ గొడవ?' అని గట్టిగా నిలదీసిన వాళ్ళకి కూడా ఏదో ఓ ఆభరణం ముట్టచెప్తున్నారట' అని పుకారు పుట్టింది. దాంతో అంతో ఇంతో పలుకుబడి ఉన్న వాళ్ళంతా లెక్కలు కట్టుకుని వెళ్ళిపోతున్నారు.

మా వెంకట్ నా సోదరుడు. అన్నయ్యా కాదు, తమ్ముడూ కాదు. ఇద్దరం కవలలం. వాడికి అక్కడ చాలా పరపతి ఉంది. ఏదో మామూలు సమయాల్లో నేరుగా దర్శనం చేయిస్తాడు అనుకుంటే పొరపాటు. బ్రహ్మోత్సవాలలో గరుడసేవనాడు

కాటేజీ ఇప్పించగల సమర్థుడు. ముక్కోటి ఏకాదశినాడు ఏదో ఓ గుంపులో కలిపేసి ఉత్తరద్వార దర్శనం చేయించగల సత్తా ఉన్నవాడు.

మరలాటివాడు ఇలాంటి సమయంలో వెళ్ళడా? ముందు 'ఎందుకులేరా దేవుడి సొమ్ము. పాపం చుట్టుకుంటుంది' అన్నాం నేనూ మా అక్కయ్యా. 'ఆ... ఏం చుట్టుకోదు. లోతుగావెళ్ళి ఆలోచిస్తే అసలు గూడార్థం తేటతెల్లమవుతుంది – ఈ బంగారం ఎవరి దగ్గరకు పోతోంది? డబ్బున్నవాళ్ళ దగ్గరకేగా? డబ్బున్నవాళ్ళంటే ఎవరూ... కుబేరుడి వారసులు. మరి కుబేరుడికి స్వామివారు అప్పు తీర్చాలి కదా! దాంతో, కుబేరుడికి ఇస్తే ఏం, ఆయన వారసులకు ఇస్తే ఏం అని ఊరుకుని ఉంటాడు. లేకపోతే భస్మీపటలం చేసెయ్యడూ! నేను మరీ కుబేరుడికి దగ్గర చుట్టాన్ని కాకపోయినా, ఇల్లూ వాకిలీ ఉన్నాయి కాబట్టి భరతవంశంలో జనమేజయుడిలాగా ఆ వంశానికి చెందినవాడినే. వెళ్ళి చూస్తాను. దొరికిందా... ఆ భగవంతుడి దయ అనుకుంటాను. లేదూ ఓ దణ్ణం పెట్టుకుని లడ్డూలు తీసుకుని వస్తాను' అన్నాడు.

మేం దైవభక్తీ పాపచింతనా ఉన్నవాళ్ళం కాబట్టి ఇంత చర్చ జరిపి నిర్ణయం తీసుకున్నాంగానీ అందరూ ఉన్నపాటున బయలుదేరారట. రైళ్ళూ, బస్సులూ అన్నీ ఫుల్. ఆర్టీసి వాళ్ళు ఆపద్ధర్మంగా సిటీబస్సులనే చార్జీలు రెట్టింపుచేసి స్పెషల్ సర్వీసులు నడుపుతున్నారట. రైళ్ళకి అదనపు బోగీలు తగిలించారట. అన్నీ ప్రయత్నించి వీలుకాక వచ్చేశాడు వెంకట్. కారులో వెళ్తాను అని డ్రైవర్ని తీసుకుని బయలుదేరాడు.

'ఓయమ్మో, నాలుగు బ్రహ్మోత్సవాలు ఒక్కసారే జరిగినట్లుగా ఉంది. జనం ఇసకేస్తే రాలటంలేదు' అని ఫోన్ చేశాడు. అంత రద్దీలో వీడిదాకా ఏం వస్తాయిలే అనుకున్నాం. కానీ మావాడు ఘటికుడు. మొత్తానికి సాధించాడు.

"చాలా మంది వచ్చి బెదిరించినా 'ఏడిశావులే, నీ దిక్కున్నచోట చెప్పుకో' అని తిప్పికొడుతున్నారు. మరి నేను అలా కాదు కదా! 'మీ బండారం బయటపెడతా! ఇదిగో ఇదీ నా ఆయుధం' అని తురుపుముక్క కొట్టేసరికి భయపడిపోయారు. బాగానే ముట్టజెప్పారు" అన్నాడు సంతోషంగా. అంతేగానీ అసలు విషయం చెప్పలేదు.

అప్పటినుంచీ నాకూ మా అక్కయ్యకూ కాలు నిలవడంలేదు. తోచటంలేదు. అటూ ఇటూ తిరుగుతూనే ఉన్నాం.

ఎలాగైతేనేం, వచ్చేశాడు మా వెంకట్. "ముందు నాకు కాఫీ ఇవ్వండి" అన్నాడు మమ్మల్ని నోరెత్తనివ్వకుండా. కాఫీ ఇచ్చాక తాగుతూ బోలెడన్ని విశేషాలు చెప్పాడు.

చివరికి ఆర్జిత సేవ చేయించినప్పుడు భక్తులకి ఇచ్చే ఉత్తరీయం మూట పెట్లోంచి తీసి ఇచ్చాడు. విప్పి చూశాం. అందులో చిన్నసైజు కిరీటం, చిన్న అభయహస్తం, బంగారు పాదం ఒకటి, ఒక బంగారపు ఏకహారతి ఉన్నాయి.

నాకు ఒళ్ళుమండింది. "ఇదేవిట్రా?" అన్నాను.

"ఏం వచ్చింది? చూడు దుక్కముక్కల్లా ఉన్నాయి" అంది మా అక్కయ్య – ఆ ఆభరణాలను అదూ ఇటూ మురిపెంగా చూస్తూ.

"దుక్కముక్కలు సరేలే. ఏ కంఠహారమో కాసులపేరో తీసుకురారా అని చిలక్కి చెప్పినట్లు చెప్పి పంపించాను. అలాంటి వస్తువులైతే ఎవరైనా వచ్చి నిలదీసినా ఇవన్నీ మా తాత ముత్తాతలనాటి నగలు అని అడ్డంగా బుకాయించవచ్చు. ఈ కిరీటం, అభయహస్తం మా పూర్వీకులవి అంటే ఎవరైనా నమ్ముతారా? వాడికి హడావిడి ఎక్కువ – ఆలోచన తక్కువ" విసుక్కున్నాను.

"హడావిడి కాదులేవే. నీ మాత్రం ఆలోచన ఎదుటివాళ్ళకుండదా! ఆ హారాలూ కడియాలూ వాళ్ళే తీసేసుకున్నారు. ఇదిగో నా బోటివాడికి ఇటువంటివి మిగిలాయి. అయినా ఫర్వాలేదులే. మీరిద్దరూ కలిసి ఆ రాళ్ళూ, రత్నాలూ పీకేసి బంగారు కరిగించెయ్యండి" అన్నాడు.

"ఇదేమైనా నేతిగిన్నెట్రా, గ్యాసు పొయ్యిమీద కరిగించేందుకు? దానికి బోలెడంత సరంజామా ఉండాలి. మెలకువలు తెలిసుండాలి" అన్నాను.

"సర్లేవే, ఏదో తెచ్చాడుగా. ఏ అటకమీదో దాచిపెడదాం. ఈ గొడవ కాస్త సద్దుమణిగాక ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" అంది అక్కయ్య.

"ఖర్మకాలి ఈలోగా ఎవరైనా సోదా చెయ్యడానికి వస్తే?" భయం బయట పెట్టుకున్నాను.

"అంత సోదా చెయ్యడానికి వస్తే విసిరి అవతల పారేద్దాం. అప్పటికి నువ్వింకా పుట్టలేదు. నాకు బాగా చిన్నతనం. పొట్టి శ్రీరాములుగారు పోయినప్పుడు అల్లర్లు జరిగి బెజవాడలో రైల్వేవాళ్ళ గోడౌను లూటీ చేశారు. ఎవరికి దొరికిన వస్తువు

వాళ్ళు పట్టుకుపోయారు. పోలీసులు రంగంలోకి దిగేసరికి దాచుకున్న వస్తువులన్నీ బావుల్లోనూ, రోడ్లమీదా పారేశారు" మా అక్కయ్య ధైర్యం చెప్పింది.

"ఆ నగలెంత ముచ్చటగా ఉన్నాయో! ఏ దేవుడికి చెందిన అలంకారాలో" అని చేతుల్లోకి తీసుకున్నాను. "ఏ పుణ్యాత్ములు చేయించి స్వామికి అర్పించుకున్నారో" అని కళ్ళకద్దుకున్నాను.

✧ ✧ ✧

తలుపు చప్పుడైంది. నిద్ర మెలకువ వచ్చింది. "అమ్మా... గది చిమ్మనా, నిన్నా చిమ్మలేదు" అంది మా పనిమనిషి.

అప్పుడు తెలివి వచ్చింది. ఇదంతా కలా అనుకున్నాను. ఇంకా ఆ నగల చక్కదనం కళ్ళముందు కదుల్తూనే ఉంది. టైము చూస్తే ఎనిమిదిన్నర. ఇంట్లో నేను చేయాల్సిన పనేమీ ఉండదు. నా బాధ్యతలు తీరిపోయాయి కాబట్టి ఇంట్లోనే తామరాకుమీద నీటిబొట్టులా ఉంటున్నాను. ఏమీ పట్టించుకోను. నా ఇష్టం వచ్చినప్పుడు పడుకుని నా ఇష్టం వచ్చినప్పుడు లేస్తాను.

టీవీలో అర్ధరాత్రిదాటాక మంచి పాత హిందీ సినిమాలూ ఇంగ్లీషు సినిమాలూ వస్తాయి. అవి చూస్తాను. ఏ మూడింటికో పడుకుంటాను. ఇలా బారెడు పొద్దెక్కాక లేస్తాను. ప్రతిరోజూ ఏదో ఒక కల వస్తూనే ఉంటుంది నాకు. పగలంతా బుర్రలో ఉన్న ఆలోచనలే కలల్లో ప్రతిబింబిస్తాయి.

కోలా క్రిష్ణమోహన్‌కి లాటరీ వచ్చినప్పుడు నాకూ ఎనభై ఎనిమది కోట్లు లాటరీ వచ్చినట్టూ ఆ డబ్బు పంచలేక, దాచలేక చచ్చి సతమతం అయినట్టూ కలొచ్చింది.

కాందహార్‌లో విమానం హైజాక్ అయినప్పుడు నేనూ ఆ విమానంలో ఉండి వాళ్ళకు ఎదురు తిరిగినట్లూ వాళ్ళు నన్ను కాల్చి చంపేసినట్లూ కలొచ్చింది.

మా బిల్డింగుకి పెయింట్ వేయిస్తూ ఓ యాభై పెయింటు డబ్బాలు తెచ్చి బిల్డింగ్ ప్రెసిడెంట్ మావారు కనుక మా ఇంట్లోపెడితే, ఆ రాత్రి నన్నెవరో కిడ్నాప్‌చేసి తీసుకపోయి, ఆ పెయింట్ డబ్బాలు మాకిస్తే మీ ఆవిడని వదిలేస్తాం అని మా ఆయనకి ఫోన్ చేసి బెదిరించినట్లూ మా ఆయనేమో నిండు డబ్బాలు కాదు కదా ఖాళీ డబ్బాలు కూడా ఇవ్వను పొమ్మని చెప్పినట్లూ కలొచ్చింది.

మొన్నటికి మొన్ననాకు ఫ్లూజ్వరం వచ్చినట్లూ అది స్వైన్‌ఫ్లూ ఏమో అని భయంగా ఉందని ముక్కుకి మాస్క్ కట్టుకోమనీ డాక్టరు చెప్పినట్లూ నేను జంటనగరాలు అంతా తిరిగి గాలించినా ఒక్క మాస్క్ కూడా దొరకనట్లూ చివరికి వినాయకుడి విగ్రహానికి కాపలా ఉన్న పోలీసు తరిమినట్లూ కలొచ్చింది.

ఇవ్వాళ ఈ నగలు.

ముఖం కడుక్కుని బెడ్‌రూంలోంచి బయటికి వచ్చేసరికి "అత్తయ్యగారొచ్చేశారు. ఇవ్వాళ ఏం కలొచ్చిందో చెప్తారు" అని కేకపెట్టింది మా కోడలు.

మా ఇంట్లో వాళ్ళందరికీ నా కలల కథలంటే చాలా ఇష్టం. పురాణం విన్నట్లు వింటారు. నేను లేచేసరికి మా అబ్బాయి కనుక ఆఫీసుకి వెళ్ళిపోతే లంచ్‌టైములో ఫోన్ చేసి మరీ అడుగుతాడు. ఏ పూట కల గురించి ఆ పూట తెలుసుకోకపోతే మర్నాటికి మరో కల కథ ఉంటుంది కదా!

కాఫీ తాగుతూ నాకొచ్చిన కల గురించి చెప్పాను. అందరూ ఎంజాయ్ చేశారు. అంతలో డోర్ బెల్ మోగింది. తలుపు తీస్తే మా వెంకట్. ఇటొచ్చినప్పుడు వచ్చి మమ్మల్ని పలుకరించిపోతాడు. లోపలికొచ్చి కూర్చుంటూ "చూశారా బావగారూ, తిరుమలలో నగల గొడవ. ఘోరం కదూ!" అన్నాడు గొల్లున నవ్వేశారు మా వాళ్ళు. ఎందుకో అర్థం కాక మా వెంకట్ తెల్లమొహం వేశాడు.

*ఈనాడు ఆదివారం, 25 అక్టోబరు 2009*